క్లుప్తంగా

గ్రేడ్-2 కమిషనర్‌గా చింతా వేణు


చింతా వేణు

వైరా: వైరా మున్సిపల్ కమిషనర్ చింతా వేణుకు గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం ఉన్నతాధికారుల నుంచి ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే చంద్రావతి


మాజీ సీఎం కేసీఆర్, కవితతో వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

వైరా: మాజీ సీఎం బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావును శుక్రవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకొని.. 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వైరా నియోజకవర్గం నుంచి మహిళలను అధికంగా తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.కవిత ఉన్నారు.

గ్రామాల్లో చేతిపంపులు ఏర్పాటు


చేతి పంపును ప్రారంభిస్తున్న దృశ్యం

కల్లూరు: పట్టణంలోని శాంతినగర్, మండలంలోని రఘునాథబంజర, పెనుబల్లి మండలంలోని మండాలపాడు గ్రామాల్లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఆధ్వర్యంలో రూ. 2.10 లక్షల విలువైన తాగునీటి చేతి పంపులను శుక్రవారం సీడీఏ కార్యదర్శి పి.ఎనోష్‌కుమార్, వెల్స్‌ఫర్ లైఫ్ అధినేత మైకెల్ నైజర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీఏకు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏబసీసీ నాయకులు సంజీవరావు, ఇజ్రాయిల్, జీవన్ కుమార్, రాజశేఖర్, సత్యనారాయణ, జైదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇవేం రోడ్లు బాబోయ్..


గుంతల్లో వర్షం నీరు నిలిచిన కారేపల్లి - బస్వాపురం రోడ్డు


కంకరతేలిన గేటుకారేపల్లి - అనంతారం రోడ్డు

అధ్వానంగా అంతర్గత రహదారులు
- కంకరతేలి, గుంతలమయంగా మారిన రోడ్లు
- హామీలతో నరిపెట్టుకుంటున్న ప్రజా ప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

కారేపల్లి: మండలంలో అతర్గత రహదారులు అధ్వానంగా తయారైయ్యాయి. పాలకులు మారినా తమ తలరాతలు మారలేదని, రోడ్డు బాగు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 60వేల జనాభా, 41 గ్రామ పంచాయతీలు, 116 శివారు గ్రామాలతో విస్తరించి ఉన్న కారేపల్లి మండలంలో వివిధ గ్రామాలను కలుపుతూ.. నిర్మించిన రహదారులు అధ్వానంగా తయారైయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన తమ గ్రామాలకు మాత్రం తారు రోడ్డు లేదని, గుంతలమయమైన మట్టి రోడ్లతో, కంకర తేలిన మెటల్ రోడ్లతో నరకయాతన అనుభవిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు గోడు వెళ్లబుచ్చుకుంటున్నారు.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

● కారేపల్లి బీసీ కాలనీ నుంచి బస్వాపురం వరకు 4కిలో మీటర్ల మేర కంకర రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంకర తేలి, పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని గతంలో ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి మర్చిపోయారు.

● గేటుకారేపల్లి రైల్వేగేటు నుంచి అనంతారం గ్రామం వరకు 3కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ఈ మెటల్ రోడ్డును తారు రోడ్డుగా నిర్మాణం చేపట్టితే.. నూరుశాతం ఆదివాసీ గ్రామాలైన అనంతారం, రేగులగూడెం, రామకృష్ణాపురం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం సులభం అవుతుంది. ఇదే రహదారి నుంచి కారేపల్లిలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు ఆటోలు, సైకిళ్ల ద్వారా విద్యార్థులు తమ రాకపోకలను సాగిస్తుంటారు.

● గాజులతండా గ్రామం నుంచి నడిమూరు - సీతారాంపురం రోడ్డు వరకు 3కిలో మీటర్లు, ఉసిరికాయలపల్లి డొంక రోడ్డు నుంచి శాంతినగర్ గ్రామం వరకు మట్టి రోడ్లు ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా కొట్టుకుపోయి మోకాళ్ల లోతు గోతులు ఏర్పడ్డాయి.

● భల్లు నగర్ తండా నుంచి కొమ్ముగూడెం వరకు 3కిలో మీటర్లు, భల్లు నగర్ తండా నుంచి వెంకిట్యాతండా వరకు కిలో మీటరు మేర బీటీ రోడ్డు వేసి.. రాకపోకలు సుగమం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



గుంతలమయమైన రహదారిలో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కారేపల్లి బీసీ కాలనీ నుంచి భల్లునగర్ రోడ్డు మీదుగా బస్వాపురం వరకు 4కిలో మీటర్ల మేర కంకర రోడ్డుతో అధ్వానంగా ఉండడంతో పాటు.. మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. మండల కేంద్రానికి రావాలంటే పది గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. మరీ అధికారులు మా గోడు పట్టించుకుంటారో లేదో చూడాలి.
– షేక్ అక్బర్, కారేపల్లి

కంకర తేలి ఉంది..



గేటుకారేపల్లి రైల్వే గేటు నుంచి అనంతారం, రేగులగూడెం గ్రామాలకు వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారైంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, జిల్లా మంత్రుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లాం.. కానీ, వారు హామీలైతే ఇచ్చారు కానీ, బీటీ రోడ్డు మాత్రం వేయలేదు. ఈ రోడ్డుపై వాహనాలు ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. కనీసం ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకొని బీటీ రోడ్డు వేయాలి.
– ఈసం అరుణ, మాజీ సర్పంచ్, రేగులగూడెం

అసంపూర్తిగా ముద్దునూరు-రంగాపురం రోడ్డు..



తల్లాడ: మండలంలోని ముద్దునూరు – రంగాపురం గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు పలు చోట్ల గుంటలు ఏర్పడి అధ్వానంగా ఉండటంతో రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం చేసేందుకు కాంట్రాక్టర్ పాత రోడ్డును తవ్వి దానిపై కంకర, ఫ్లైయాష్ బూడిద వేశారు. ఇదంతా జరిగి ఏడాది కావొస్తున్నా.. ఇప్పటి వరకు రోడ్డు గురించి పట్టించుకున్న నాధుడే లేడు. మార్గ మధ్యలో చెరువుకూడా ఉంది. వాహనదారులు తమ ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ముద్దునూరు, రంగాపురం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా అడవిమల్లెల బీటీ రోడ్డు..



పెనుబల్లి: మండలంలోని లంకాసాగర్ క్రాస్ రోడ్డు నుంచి అడవిమల్లెల గ్రామానికి గత ప్రభుత్వ హయాంలో 2023లో పాడైన బీటీ రోడ్డు పునర్నిర్మాణం కోసం పనులు చేపట్టగా.. కాంట్రాక్టర్ కిలోమీటర్ మేర మాత్రమే రోడ్డు వేసి తర్వాత పనులు మధ్యలోనే నిలిపివేశాడు. అయితే ఈ రోడ్డుకు సత్తుపల్లి – వీయంబంజర్ జాతీయ రహదారికి అనుకొని ఉండటం, చుట్టు పక్కల గ్రామాలకు ఈ రోడ్డు ప్రధానం కావడంతో నిరంతరం రద్దీగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చాలంటూ ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వం 4కి.మీ మేర డబుల్‌రోడ్డుగా మంజూరీ చేస్తూ రూ.6కోట్లు నిధులు కేటాయించగా.. ఓ కాంట్రాక్టర్ కి.మీ మేర బీటీరోడ్డు వేయడంతో పాటు కల్వర్టుల నిర్మణం పూర్తిచేసి, మెటల్ లేయర్ పూర్తి చేశాడు. వాటి బిల్లులు చెల్లించాలంటూ ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలిపి.. ఏడాది కావస్తున్నా ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. ఇక అంతే రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. దుమ్ము, ధూళితో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనబడే పరిస్థితి లేదని త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.


వైరా: శిలువ మోస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్


సత్తుపల్లిటౌన్: శిలువ మోస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్


కల్లూరురూరల్: పెద్దకోరుకొండిలో..

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన రహదారిపై శిలువ మోస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. దేవుని పాటలు పాడుతూ.. శిలువధారణ ఘట్టాన్ని జరుపుకున్నారు. ఆయా చర్చీల్లో నిర్వహించిన ప్రార్థనల్లో ఫాదర్లు క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల అంతరార్థాన్ని భక్తులకు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
– సాక్షి నెట్‌వర్క్


మధిర: బయ్యారంలో..


వైరారూరల్: శిలువమార్గ ప్రదర్శనలో క్రైస్తవులు


చింతకానిలో..


తల్లాడ: శిలువమార్గ ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవ భక్తులు, ఫాదర్ అజయ్


కల్లూరులో..


ముదిగొండలో..


ఎర్రుపాలెం: కొత్తపాలెంలో శిలువ మోస్తున్న విచారణ గురువు ఏసు

వక్ఫ్ చట్ట సవరణ సరికాదు..


కారేపల్లి: జామే మసీదు ఎదుట..


సత్తుపల్లిరూరల్: ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముస్లింలు


బోనకల్: ముష్టికుంట్లలో..

వైరా: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ.. వైరాలో ముస్లింలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు భారీ నిరశన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి ముస్లింల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన చట్టాన్ని కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టడం దురదృష్టకరమన్నారు. చట్టాన్ని రద్దు చేసే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రాజశేఖర్, జైపాల్, రాంబాబు, అర్జునరావు, బాబు, మజీద్ కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కారేపల్లి: కారేపల్లిలోని జామే మసీదు ఎదుట ముస్లింలు నల్లబ్యాడ్జీలతో శుక్రవారం మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జామే మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మున్నీరుద్దీన్, ముస్లిం పెద్దలు హనీఫ్, యాకూబ్ అలీ, మతీన్, షంషుద్దీన్, బందేలి, పాషా, షఫీ, యాకూబ్ పాషా, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో మజీద్ వద్ద ప్రధాన రహదారి పక్కన శుక్రవారం ముస్లిం సోదరులు శాంతిర్యాలీ, దువ్వా చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్.షాజాహాన్ మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం సంఘ నాయకులు ముస్తాఫా, రఫీ, రంజ్, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మేరాజ్ మసీద్ వెంగళరావునగర్ ముస్లిం సోదరులు రాష్ట్ర రహదారిపై నిరసన చేపట్టారు. ఆపై రాస్తారోకో నిర్వహించి మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసి భాగవోద్వేగాన్ని తెలియచేశారు. సదర్ మీర్జా సలీంబేగ్, అలీమ్ అక్తర్, నాగుల్‌మీరా, సిలార్‌సాహెబ్, మస్తాన్, షఫీ, యాకూబ్‌అలీ, హుస్సేన్, రెహమాన్, యూసఫ్, హన్ను, మసూద్, సాక్లెయిన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

● కల్లూరు మండలానికి 272 ఇందిరమ్మ గృహాలు

కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణ పథకానికి సంబంధించి కల్లూరు మండలానికి మొదటి విడతగా 272 గృహాలు మంజూరయ్యాయి. తూర్పులోకవరం గ్రామానికి 57 గృహాలు, పడమర లోకవరం గ్రామానికి 15 గృహాలు, మర్లపాడు గ్రామానికి 15, ముచ్చవరం గ్రామానికి 20, నారాయణపురం గ్రామానికి 20, ఓబులరావు బంజరుకు 10, పాయపూర్‌కు 15, పెద్దకోరుకొండి పంచాయతీకి 25, పేరువంచ గ్రామపంచాయతీకి 30, పోచవరం గ్రామ పంచాయతీకి 10, పుల్లయ్య బంజరుకు 20, రఘునాధగూడెం గ్రామపంచాయతీకి 20 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయి.

● రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

వైరా: ఖమ్మంలో ఈనెల 24నుంచి 26వరకు నిర్వహించే ఎస్ఎఫ్ఐ ఐదో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ పిలుపునిచ్చారు. వైరాలోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు దొంతెబోయిన వెంకటేష్‌తో కలిసి శుక్రవారం ఆయన మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు జెమినీ అశోక్, నాగేశ్వరరావు, బాలాజీ, రాములు, లోకేష్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న న్యాయవాది రత్నాకర్

కల్లూరు: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని కల్లూరు మండలానికి చెందిన ప్రముఖ న్యాయవాది, నోటరి పప్పుల రత్నాకర్ శుక్రవారం నూతన బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి స్వాంతన కలిగించేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. మజ్జిగదాత రత్నాకర్‌కు ఆర్టీసీ టీమ్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ పుట్టిన రోజు సందర్భంగా పుల్లయ్యబంజర్ గ్రామానికి చెందిన జలగం అనుచరుడు సాయిన్ని రామారావు కూడా మజ్జిగ పంపిణీ చేశారు.

● గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ముదిగొండ: మండలంలోని వనంవారికిష్టాపురం, ముదిగొండలలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ముదిగొండ మండలంలోని నేటి నుంచి మే 16వరకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారులు రమేష్, అశోక్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

● మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

సత్తుపల్లిరూరల్: కిష్టారం ఓసీలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ అన్నారు. ఓసీ ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం పీఓ నర్సింహారావును కలిసి చర్చించారు. కిష్టారం ఓసీలో మాస్ పవర్ సర్దుబాటు చేయడంతో పాటు టెక్నీషియన్స్, ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్యాంటిన్, రెస్ట్ హాల్‌లో సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు.. ఉద్యోగులకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. స్పందించిన పీఓ సాధ్యమైనంత త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు క్రాంతికుమార్, నాగప్రకాష్, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి, గాంధీనగర్ కాలనీ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పందిళ్లపల్లి గ్రామానికి చెందిన సంతకాల సుగుణమ్మ, గాంధీనగర్‌కాలనీ గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.1.20 లక్షల విలువైన చెక్కులను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


మల్లుపల్లిలో ప్రారంభిస్తున్న సొసైటీ డైరెక్టర్ పుల్లయ్య

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ డైరెక్టర్ రాయల పుల్లయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్ కూడా ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై సర్వే

కారేపల్లి: మండలంలోని విశ్వనాథపల్లిలో గ్రామ సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో డబుల్‌బెడ్రూం కాలనీకి రహదారి సరిగా లేదని, వర్షం వస్తే గుంతల్లో నీళ్ల నిలుస్తుండడంతో పాటు వీధిలైట్లు లేవని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంగయ్య, మురళీ, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై..

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కృష్ణ, నాగేశ్వరరావు, జానకీరాములు, శ్రీను, వెంకటేశ్వర్లు, లెనిన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నేడు విద్యుత్ సరఫరా బంద్

తల్లాడ: తల్లాడ, కుర్నవల్లి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం నాడు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తల్లాడ, కుర్నవల్లి సెక్షన్ల విద్యుత్ ఏఈలు రాయల ప్రసాద్, దారా కృష్ణకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లాడ, కుర్నవల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.